క్లుప్తంగా

ఘనంగా వృద్ధుల దినోత్సవం



కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలోని విశ్వశాంతి వృద్ధాశ్రమంలో వృద్ధుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ నాయకులు రంగినేని జగదీశ్వరుడు వృద్ధులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. వారికి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది మధుసూదన్‌రావు, శివ, చిట్టిబాబు, వెంకటస్వామి తదితరులున్నారు.

ఆటో బోల్తా: ఇద్దరికి తీవ్రగాయాలు

బిజినేపల్లి: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి గుడి సమీపంలో నందివడ్డెమాన్ నుంచి బిజినేపల్లి వైపు వస్తున్న ఆటోబోల్తా పడి ఇద్దరికి గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం నందివడ్డెమాన్‌లో దశదినకర్మను ముగించుకున్న నలుగురు బంధువులు ఒక ఆటోలో మంగనూర్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. మండల కేంద్రానికి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న నలుగురిలో చంద్రమ్మ, లక్ష్మమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో ఏఈటీ శివశంకర్, పైలట్ వెంకటయ్యలు ప్రథమ చికిత్స చేసి నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

వ్యక్తి అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యక్తి అదృశ్యం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన పర్వతాలు గతనెల 29న ఇంట్లో ఎవరికి చెప్పకుండా అర్ధరాత్రి వెళ్లిపోయాడు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండటంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



కొల్లాపూర్: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అధికార పార్టీ నాయకులు పక్షపాత వైఖరిని చూపారని బీఆర్‌ఎస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ ఆరోపించారు. కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చుక్కాయిపల్లిలో పలువురు అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయకుండా అధికార పార్టీకి చెందిన వారికి మాత్రమే ఇళ్లు కేటాయించారన్నారు. దీనిపై మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి, అర్హులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు రాము, కురుమయ్య, తదితరులున్నారు.

గుంతలు పూడ్చివేత



తెలకపల్లి: మండల కేంద్రం తెలకపల్లిలో ప్రధాన కూడలి నెహ్రూ చౌరస్తాలో గుంతల్లో వర్షపు నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అచ్చంపేట, నాగర్‌కర్నూల్, లింగాల వెళ్లే దారిలో గుంతలు ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ యువకులు గ్రామస్తులు గుంతలు పూడ్చారు. నెహ్రూ చౌరస్తాలో కొంత ఇబ్బంది తొలగినట్లు ప్రయాణికులు వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

తైబజారు అధిక వసూళ్లను అరికట్టాలి

కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలో చిరువ్యాపారుల నుంచి తైబజారు వసూళ్లు అధికంగా చేస్తున్నారని ప్రజావికాస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు కలమంద శేఖర్ ఆరోపించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా, బస్టాండ్ సమీప ప్రాంతాల్లో సీతాఫలం పండ్లు విక్రయించేందుకు వచ్చే వారి నుంచి అధికంగా తైబజారు వసూలు చేస్తున్నారని, వారికి రశీదులు కూడా ఇవ్వడం లేదన్నారు. ఒక గంపకు రూ.40 వసూలు చేయాల్సి ఉండగా, తైబజారు కాంట్రాక్టర్ అధిక మొత్తం వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

బాణాలలో వాలీబాల్ పోటీలు

బల్మూర్: విజయదశమి పర్వదినం సందర్భంగా బుధవారం బాణాల గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించారు. గెలుపొందిన వారికి బహుమతులు దాత రాత్లావత్ రమేష్ నాయక్ అందజేయనున్నట్లు వారు తెలిపారు.



గుట్టలపల్లిలో కరెన్సీతో అలంకరించిన అమ్మవారు



కోడేరులో రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు



నాగర్‌కర్నూల్‌లో మహిషాసుర మర్దిని అవతారంలో దర్శనమిచ్చిన వాసవీమాత

మహిషాసురమర్ధిని పాహిమాం

- ఘనంగా దేవీశరన్నవరాత్రి వేడుకలు
- చండీహోమం, అన్నప్రసాదం పంపిణీ
- దుర్గామాతకు ప్రత్యేక పూజలు

సాక్షి, నెట్‌వర్క్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గామాత మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు హోమం, అన్నప్రసాద పంపిణీ, పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవిమాత మహిషాసుర మర్దని అవతారంలో పూజలు చేశారు.

- జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో శివశక్తి యూత్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యూత్, కాలనీవాసులు అన్న ప్రసాద పంపిణీ చేశారు.
- కల్వకుర్తి పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం, లింగసానిపల్లి గ్రామంలో అమ్మవారిని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కోరారు.
- కొల్లాపూర్ మండలంలోని ఎన్మన్‌బెట్లలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు.



పాపగల్ దుర్గామాతకు పూజలు చేస్తున్న మాలలు ధరించిన భక్తులు

- పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో చండీకాదేవిగా అలంకరించి, చండీ హోమం నిర్వహించారు.
- లింగాల మండలంలోని ఆయా గ్రామాలలో అమ్మవారు మహిషాసుర మర్దని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- ఉప్పునుంతల కేదారేశ్వరాలయంలో మహిళలు దుర్గామాతకు కుంకుమార్చన, పూజలు చేశారు.
- బల్మూర్ మండంలోని బల్మూర్, గోదల్ గ్రామాల్లో భక్తులు అమ్మవారిని మహిషాసురమర్దిని రూపంలో పూజలు చేశారు.
- తాడూరు మండలంలో అమ్మవారిని మహాలక్ష్మి అలంకరణలో పూజించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



కొండనాగులలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

- చారకొండ మండలం జూపల్లిలో భగత్‌సింగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని మహిషాసుర మర్దిని అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాభవాని యూత్ ఆధ్వర్యంలో దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.
- కోడేరు మండల కేంద్రంతో పాటు రాజాపూర్, నర్సాయిపల్లి గ్రామాల్లో అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి పూజలు చేశారు.



నాగర్‌కర్నూల్ లోని రాఘవేంద్రకాలనీలో దుర్గామాత పూజలో పాల్గొన్న భక్తులు



పాపగల్‌లో యజ్ఞంలో నిమగ్నమైన భక్తులు



ఉప్పునుంతలలో దుర్గామాతకు కుంకుమార్చన చేస్తున్న భక్తులు

గ్రామాభివృద్ధికి నడుంకట్టిన యువత



మొల్కమామిడి గ్రామ ముఖద్వారం

అమ్రాబాద్: గ్రామాభివృద్ధికి మొల్కమామిడి గ్రామ యువత, ఉద్యోగులు నడుం కట్టారు. గ్రామంలో మొత్తం 180 కుటుంబాలు ఉండగా, 600 వరకు జనాభా ఉంది. వీరంతా రెండు నెలల క్రితం సమావేశమై గ్రామాభివృద్ధికి పాటు పడాలని తీర్మానించారు. ఉద్యోగులు, పెద్దలు కొంతమంది ఇప్పటికే పాఠశాల అభివృద్ధి, గ్రామ ముఖద్వారం ఆర్చ్, అంగన్‌వాడీ భవనానికి స్థలం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ చొరవతో అంగన్‌వాడీ నూతన భవనం మంజూరు చేశారు. సీబీఎం ట్రస్టు ఆధ్వర్యంలో క్రీడా ప్రాంగణం, సీసీ కుర్చీలు, చిన్నారులకు జారుడుబండ, మొక్కల పెంపకం తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. 'గ్రామాభివృద్ధికి మనమందరం' అనే కార్యక్రమం తీసుకున్నారు. విజయదశమి పర్వదినాన్ని ఊరంతా ఒకే దగ్గర వంటలు చేసుకోవడం బతుకమ్మ, వాలీబాల్ టోర్నీ నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఎంపీ మల్లురవి రానున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ బృందం తెలిపారు.

రోడ్డుపై భోజనం చేసి భక్తుల నిరసన

కల్వకుర్తి రూరల్: మండలంలోని యంగంపల్లి గ్రామంలో బుధవారం భవాని దీక్ష తీసుకున్న భక్తులు రోడ్డుపై బైఠాయించి భోజనం చేస్తూ నిరసన తెలిపారు. పదేళ్లుగా యంగంపల్లి పాఠశాల ఆవరణలో దుర్గామాతను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తారు. గ్రామంలో కొంతమంది అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంటనే అక్కడి నుంచి ఖాళీ చేయాలని భవాని దీక్ష తీసుకున్న వారిని హెచ్చరించారు. దీంతో అక్కడి నుంచి సామగ్రి అంతా వెంట తెచ్చుకొని రోడ్డుపక్కల వంట చేసి భోజనం చేసి నిరసన తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీఓ, మండల విద్యాశాఖ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. భవాని భక్తులను ఇబ్బందులకు గురి చేయడంపై విమర్శలు తలెత్తాయి.



రోడ్డుపై భోజనం చేసి నిరసన తెలుపుతున్న భవాని భక్తులు

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చారకొండ: మండలంలోని బీజేపీ స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి సత్తా చాటాలని బీజేపీ మండల అధ్యక్షుడు చెలమోని కృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ఎన్నికలో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో లావణ్య, రవీందర్, హరిబాబు, వేణు శర్మ, కామోజీ శ్రీకాంత్, శంకర్, తిరుమల లావణ్య, మహేష్ రెడ్డి, మల్లేష్, జంగయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



మన్ననూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో నాయకులు

లింగాల: మండలంలోని రాయవరంలో బుధవారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు గువ్వని నవీన్ మాట్లాడుతూ వందేళ్ల క్రితం ఆవిర్భవించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లక్ష్యం, ఉద్దేశాల గురించి శతాబ్ది ఉత్సవాలలో వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలతో పాటు బీజేపీ నాయకులు రమేష్, జైనోజు, లింగంగౌడు, మహేష్, అంజి పాల్గొన్నారు.

వ్యక్తి నిర్మాణమే దేశ నిర్మాణం

మన్ననూర్: వ్యక్తి నిర్మాణం ద్వారానే దేశ నిర్మాణం చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని వనవాసి కల్యాణ పరిషత్ తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు కాట్రాజు వెంకటయ్య అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల స్థాపనలో భాగంగా బుధవారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, లింగయ్య, వెంకటరమణ, సంబు శ్రీనివాసులు, డాక్టర్ సురేష్, చంద్రవ, అంజి పాల్గొన్నారు.

మళ్లీ పొంగిన పోల్మూరు దెమ్మ

తాడూరు: పోల్మూరు గుట్టలపల్లి గ్రామాలను అనుసరించుకొని ఉన్న కల్వర్టుపై నుంచి మంగళవారం రాత్రికురిసిన భారీ వర్షానికి వర్షపు నీటి ప్రవాహం అధికమైంది. దీంతో రాకపోకలు నిలిచాయి. వర్షం వచ్చిందంటే గుట్టలపల్లి గ్రామానికి రాకపోకలు స్తంభించి పోల్మూరు దెమ్మ వాగు ఉధృతం కావడం వల్ల రాకపోకలు నిలిచిపోతున్నాయి. అధికారులు పరిశీలించి కాజ్‌వే బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులు చేపట్టాలని గుట్టలపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ



వెల్దండ: మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఎస్‌ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో ఆయుధపూజ నిర్వహించారు. వేదపండితులతో పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సిబ్బందికి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



తాడూరు: దసరా సందర్భంగా బుధవారం మండల కేంద్రంతో పాటు గుంతకోడూరు, ఇంద్రకల్ గ్రామాల్లో ప్రబోధ సేవా సమితి హిందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగద్గీత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సేవా సమితి అధ్యక్షుడు మనోహర్ సాయిశంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో హిందు జ్ఞానవేదిక సభ్యులు రమాదేవి, స్వప్న ఆత్మారాం, ఆంజనేయులు, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాల్లో మహిళలు



దోమలపెంటలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మహిళలు

దోమలపెంట: దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకుని దోమలపెంటలో మహిళలు ఇంటి వద్ద రంగురంగు పువ్వులతో బతుకమ్మను తయారు చేసి ప్రతిరోజు సాయంత్రం అమ్మవారి మండపం వద్దకు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతూ శరన్నవరాత్రులు నిర్వహిస్తున్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.2.5 లక్షల విరాళం



ఆలయ అభివృద్ధికి విరాళం అందజేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ: మండలంలోని నారాయణపూర్ తండాలో నూతనంగా నిర్మిస్తున్న హన్‌మాన్ దేవాలయ నిర్మాణానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బుధవారం రూ.2.50 లక్షల చెక్కును ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరు భక్తిభావంతో మెలగాలన్నారు. దైవభక్తి కల్గి ఉంటే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు గోపాల్‌నాయక్, అంజి నాయక్, గోపి, తారాసింగ్, లక్ష్మీపతి, నరసింహ, తదితరులు ఉన్నారు.

పంచాయతీ ఎన్నికలపై సిబ్బందికి శిక్షణ



నాగర్‌కర్నూల్‌లో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు



ఉప్పునుంతలలో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి

నాగర్‌కర్నూల్ రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన నాయకులతో, పంచాయతీ కార్యదర్శులకు స్థానిక ఎన్నికల నిర్వహణపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సురేష్‌కుమార్, జెడ్పీఆర్వో సంగప్ప, తహసీల్దార్ తబిత, ఎంపీడీఓ చిన్నమ్మ, ఎంపీఓలు హాజరయ్యారు.

తిమ్మాజీపేట: మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీదేవి, తహసీల్దార్ రామకృష్ణయ్య, ఎంఈఓ సత్యనారాయణ శెట్టి ఉన్నారు.

తెలకపల్లి: మండల కాంప్లెక్స్ మీటింగ్ హాల్లో వివిధ పార్టీల నాయకులు పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ జాకీర్ అలీ, ఎంపీఓ వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కందనూలు: జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు బుధవారం శిక్షణ నిర్వహించారు. ఎన్నికల మాస్టర్ ట్రైనర్ వేముల సురేష్ పీఓ, ఏపీఓలకు ఎన్నికల నిర్వాహణ విధులపై అవగాహన కల్పించారు. ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, ఆర్డీఓ, ఎంపీఓ, అధికారులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని శిక్షణ కార్యక్రమంలో తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీఓ సత్యపాల్ రెడ్డి, ఉమాపతి, రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంఈఓ చంద్రుడు, జీహెచ్‌ఎంలు సుగుణ, శ్రీనివాసులు, శిక్షణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఉప్పునుంతల: ఎన్నికల శిక్షణలో మండల ప్రత్యేకాధికారి నాగేందర్, ఎంపీడీఓ మోహన్‌లాల్, ఎంపీఓ వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ పరుశునాయక్ పాల్గొన్నారు.

లింగాల: మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ బషీర్ అహ్మద్, జీహెచ్‌ఎం నిరంజన్, పీఓలు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ దేవేందర్ అధ్యక్షతన శిక్షణ నిర్వహించారు. ఎంపీఓ దేవేందర్, 52 మంది పీఓ ప్రిసైడింగ్ ఆఫీసర్లతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కల్వకుర్తి రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణలో ఎంపీడీఓ వెంకట రాములు, తహసీల్దార్ ఇబ్రహీం, ఎంఈఓ శంకర్ నాయక్, ఏఓ సురేష్ పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ నాగేందర్, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు ఎన్నికలపై శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉప్పునుంతల: స్థానిక సంస్థల ఎన్నికల్లో నిబద్ధతతో విధులు నిర్వహించాలని అచ్చంపేట ఆర్డీఓ మాధవి సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగేందర్, ఎంపీడీఓ మోహన్‌లాల్, ఎంపీఓ వెంకటేష్, ఎంఈఓ చంద్రశేఖర్, పీఓలు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలో ఎంపీడీఓ శంకర్ నాయక్, మండల ప్రత్యేక అధికారి రఘునాథ్ రావు, ఎంపీఓ నారాయణ ప్రిసైడింగ్ అధికారులు ఉన్నారు.

నవరాత్రి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే

బల్మూర్: మండంలోని గోదల్ గ్రామంలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో దుర్గామాతకు పూజలు చేశారు. ఆయనకు బీజేపీ మండల అధ్యక్షుడు బాలస్వామి, సోలంకి శ్రీను, సైదులు, కదిరె అంజి, శివాజీ, అనిల్, రవి, వెంకటేష్, కాశీం, భాస్కర్, సీతారాములు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.



గోదల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు



బీఆర్‌ఎస్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తిమ్మాజీపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ యువకులు బుధవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. గ్రామానికి చెందిన బీజేపీ యువకులు ప్రకాష్, గోపాల్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడు, జగ్జీవన్, రవిశంకర్, రవీందర్, మధు, జ్ఞానేశ్వర్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రైతుబంధు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు నర్సిరెడ్డి, రామస్వామి, పరుష, ఎండీ నిరంజన్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

యజమానిపై చర్యలు తీసుకోవాలి

అచ్చంపేట రూరల్: కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు యూరియా అమ్ముతున్న ఫర్టిలైజర్ షాపు యజమానిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. బుధవారం అచ్చంపేట ఏడీఏ చంద్రశేఖర్, ఏఓ కృష్ణయ్యకు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన ఎలిమినేటి సాయిబాబు మాట్లాడారు. తాను వరి పంటకు అవసరమైన యూరియా కోసం బుధవారం అచ్చంపేట పట్టణంలోని అయ్యప్ప ఫర్టిలైజర్ షాప్‌ను ఆశ్రయించగా, ఎమ్మార్పీ ధర రూ. 270 ఉండగా, రూ. 350లకు విక్రయించారన్నారు. రెండు బస్తాలకు రూ.700 ఆన్‌లైన్ ద్వారా చెల్లించినట్లు తెలిపారు. సదరు డీలర్‌పై చర్యలు తీసుకోవాలని రైతు డిమాండ్ చేశారు.